# దసరాకు సంబురాల సందడి

## నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో డబుల్ సంబురాలకు కృషి



మెహిదీపట్నం అక్టోబర్ 4: దసరా పండుగకు ప్రజలు సందడిగా సంబురాలు జరుపుకోవడానికి ''నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే''లు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రజలకు డబుల్ సంబురాలను అందించడానికి దసరా పండుగ సందర్భంగా షాపింగ్ బొనాంజా పేరుతో లక్కీ డ్రాను నిర్వహిస్తున్నారు. దశాబ్ద కాలంగా కొనసాగిస్తున్న మూడో రోజు లక్కీ డ్రాను శుక్రవారం సాయంత్రం షేక్‌పేట్‌లోని కున్ హ్యూందాయ్ కార్ షోరూంలో నిర్వహించారు. లక్కీ డ్రాలో ముగ్గురు విజేతలను డ్రా ద్వారా ప్రకటించారు. నమస్తే తెలంగాణ అడ్వర్టయిజ్‌మెంట్ జీఎం ఎన్.సురేందర్ రావు, షోరూం డీజీఎం ఆకుల కార్తీక్, వినియోగదారులు శ్రీనివాస్ రెడ్డి, షోరూం సేల్స్ మేనేజర్ శివాజీ, కస్టమర్ కేర్ మేనేజర్ శ్రీవాణిలతో కలిసి డ్రా తీశారు. మొదటి బహుమతి వినయ్ కుమార్‌కు, రెండో బహుమతి రాజ శేఖర్‌కు, మూడో బహుమతి రామ్‌లకు వచ్చింది. 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టు డే'ల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ డ్రాలో కేఎల్ఎం ఫ్యాషన్ మాల్, బిగ్ సీ,అల్మండ్ హౌస్ భాగస్వామ్యం అందిస్తుండగా, ప్రచార కర్తగా టీ న్యూస్, డిజిటల్ ప్రచార కర్త సమన్ టీవీలు కొనసాగుతున్న బొనాంజాలో మూడో డ్రా కున్ హ్యూందాయ్‌లో నమస్తే తెలంగాణ అడ్వర్టయిజ్‌మెంట్ జీఎం ఎన్.సురేందర్ రావు చేతుల మీదుగా కొనసాగింది. ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్న దసరా బొనాంజాను గ్రేటర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీఎం సురేందర్ రావు అన్నారు. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేలలో వస్తున్న దసరా షాపింగ్ బొనాంజా ప్రకటనలు చూసి ఎంపిక చేసిన ఔట్‌లెట్లలో షాపింగ్ చేసి గిఫ్ట్ గెలుచుకోవాలని ఆయన సూచిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా నమస్తే తెలంగాణ నిర్వహిస్తున్న లక్కీ డ్రాను అందరు సద్వినియోగం చేసుకోవాలి. నమస్తే తెలంగాణలో వస్తున్న దసరా బొనాంజా ప్రకటనను చూసి డ్రాలో పాల్గొనాలి. నమస్తే తెలంగాణ ఏర్పాటు చేసిన ఔట్ లెట్లలో వస్తువులను కొని డ్రాలో అదృష్టాన్ని పొందాలని నమస్తే తెలంగాణ అడ్వర్టయిజ్ మెంట్ జీఎం సురేందర్ రావు తెలిపారు. కార్యక్రమంలో షోరూం డీజీఎం ఆకుల కార్తీక్, కస్టమర్ కేర్ మేనేజర్ శ్రీవాణి, మేనేజర్ శివాజీ, వినియోగదారుడు శ్రీనివాస్ రెడ్డి ఏడీవీటీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజిరెడ్డి, సుమన్ టీవీ సీఎంఓ చంద్రక్రాంతి కుమార్, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్ చరణ్ ఆనంద్ పాల్గొన్నారు.

### డ్రా అందించడం సంతోషంగా ఉంది



దసరా సందర్భంగా బొనాంజాను అందించడం సంతోషంగా ఉంది. మా షోరూంలో కార్ డెలివరీ తీసుకున్న కస్టమర్లను డ్రాలో భాగస్వాములు చేశాము. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ప్రతి ఏడాది నిర్వహిస్తున్న డ్రా దసరాకు వినియోగదారులకు సంబురాలను తెస్తుంది. ప్రజలు డ్రా లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలి. పండుగకు బహుమతులు దొరకడం జీవితాంతం గుర్తుండిపోతుంది. దసరా సందర్భంగా కున్ హ్యూందాయ్‌లో రాయితీలు ఇస్తున్నాం. నమస్తే తెలంగాణ వారు కూడా దీనికి సమాంతరంగా ప్రతి రోజు బహుమతులు ఇస్తున్నందు వల్ల కొనుగోలుదారులకు అదనపు ప్రయోజనం చేకూరుతుంది.

– ఆకుల కార్తీక్ (డీజీఎం)

### డ్రాలో పాల్గొనడం ఆనందంగా ఉంది



హ్యూండాయ్ ఐ20 వాహనం బుక్ చేసుకుందామని కున్ హ్యూందాయ్ షోరూమ్‌కు వచ్చినప్పుడు నమస్తే తెలంగాణ ఆఫర్ గురించి చెప్పారు. కున్ హ్యూందాయ్ రాయితీతో పాటు నమస్తే తెలంగాణ లక్కీడ్రాలో నాకు బహుమతి గెలుచుకునే అవకాశం కల్పించిన నమస్తే తెలంగాణకు ధన్యవాదాలు. ఇటువంటి ఆఫర్స్ కొనుగోలుదారులకు అదనపు రాయితీతో పాటు బహుమతులు గెల్చుకునే అవకాశాలను కల్పిస్తాయి. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన షాపింగ్ డబుల్ బొనాంజా లక్కీ డ్రాలో పాల్గొనడం ఆనందంగా ఉంది. లక్కీ డ్రాను నిర్వహించడం అభినందనీయం. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేలు నిర్వహిస్తున్న ఈ లక్కీ డ్రాలో ప్రజలు పాల్గొనాలి. డ్రా విజేతగా అదృష్టం కలిసి వస్తే పండుగకు ఓ తీపి గుర్తును పొందవచ్చు.

– శ్రీనివాస్ రెడ్డి (వినియోగదారుడు)

# డబ్బులిస్తేనే మూసీ నిర్వాసితులకు పట్టాలు

- అధికారులకు సహకరించిన వారికే పట్టాల పంపిణీ
- ముసారం బాగ్, జియాగూడ, ప్రతాప సింగారంలో వెలుగులోకి..



అంబేద్కర్‌నగర్ బస్తీలో పట్టాలు పంపిణీ చేసేందుకు వచ్చిన సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, ప్రత్యేక అధికారి రాజేశ్ కుమార్, సిబ్బంది

మలక్‌పేట, అక్టోబర్ 4: మూసీ నిర్వాసితులకు పట్టాలు ఇస్తున్నారన్న వార్తలు బయటకు వస్తున్నా, అవి కేవలం డబ్బులు ఇచ్చినవారికే అందుతున్నాయని తెలుస్తుంది. ఒక వైపు ఏండ్ల తరబడి కష్టపడి కట్టుకున్న ఇల్లు పోయి, ఎలాంటి ఆవాసం లేకుండా మిగిలిపోయిన బాధితులకు ప్రభుత్వం ఓదార్పును ఇవ్వకపోగా, పీడించే అధికార యంత్రాంగాన్ని జోడించినదని బాధితులు బాహాటంగా చెబుతున్నారు. డబ్బులు తీసుకొని, అధికారులకు వత్తాసు పలికిన వారికే అధికార యంత్రాంగం డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను అందిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముసారం బాగ్ మూసీ పరీవాహక ప్రాంతంలోని నిర్వాసితులకు శుక్రవారం సైదాబాద్ మండల తహసీల్దార్, స్పెషల్ అధికారి రాజేశ్ కుమార్‌ల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేసినట్టు చెబుతుకుం టున్నా బాధితులను పీడించి అప్పగిస్తున్నట్టు తెలుస్తుంది. అయితే, అజయ్ హట్స్, ఆది జాంబవంతుని హట్స్, అంబేద్కర్‌నగర్ బస్తీలలో గురువారం 16 మందికి పట్టాలు ఇవ్వగా, శుక్రవారం సాయిలు హట్స్‌లో 13 మందికి, అజయ్ హట్స్‌లో 18 మందికి పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిసింది. మొత్తంగా 47 మందికి పట్టాలిచ్చినట్టు తెలిసింది.

### సాయిలు హట్స్‌లో కొత్తగా మరిన్ని నిర్మాణాలు

డబ్బులు తీసుకొని అధికారులు సహకరిస్తున్నారని వారితో స్థానికులు గొడవకు దిగగా, నిర్మాణాలను కూల్చివేసేందుకే మార్కింగ్ చేశామని తహసీల్దార్ వెల్లడించారు. ముసారం బాగ్‌లోని సాయిలు హట్స్‌లో గత నెల 26న సర్వేచేసి రివర్ బెడ్‌లో 25 నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటికి మార్కింగ్ చేశారు. కాగా, శుక్రవారం పట్టాలు పంపిణీ చేసి ఖాళీ చేయించేందుకు సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, ప్రత్యేక అధికారి రాజేశ్ కుమార్‌లు సిబ్బందితో రాగా, అందులో అదనంగా మరిన్ని కొత్త నిర్మాణాలు వెలిసి ఉండటం, వాటికి అధికారులు మార్కింగ్ చేసి ఉండటంతో డబ్బులు తీసుకొని వారికి సహకరిస్తున్నారని స్థానికులు అధికారులతో గొడవకు దిగారు. దాంతో కొద్దిసేపు గలాట చోటుచేసుకుంది. రంగ ప్రవేశం చేసిన పోలీసులు వారికి నచ్చజెప్పి పంపించి వేశారు. అయితే, కొత్తగా నిర్మాణాలు వెలిసింది వాస్తమేనని, వాటిని కూల్చివేసేందుకే మార్కింగ్ చేయటం జరిగిందని తహసీల్దార్ జయశ్రీ వారికి తెలిపారు.

## అసెంబ్లీని సందర్శించిన ఆస్ట్రేలియా బృందం


హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): ఆస్ట్రేలియా ప్రజాప్రతినిధుల బృందం తెలంగాణ అసెంబ్లీని శుక్రవారం సందర్శించింది. ఆ దేశానికి చెందిన మంత్రులు రిచర్డ్‌న్ రియార్డన్, బ్రాండ్ బట్టిన్ నేతృత్వంలో శాసనసభకు వచ్చారు. వీరిని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీలు ఘనంగా సన్మానించారు. అనంతరం, వీరిని శాసనసభ, మండలి భవనాలను చూపించారు. సభా కార్యకలాపాల గురించి వివరించారు.



## తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివాహ ఆహ్వానం



మల్కాజిగిరి, అక్టోబర్ 4: మల్కాజిగిరి నియోజక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మర్రి మమతారెడ్డిల ఏకైక కూతురు మర్రి శేయారెడ్డి, ఆదిత్యల వివాహం 27వ తారీఖున జరుగనుంది. వివాహానికి వచ్చి ఆశీర్వదించాలని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పెండ్లి పత్రికను అందజేసిన కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు.



మహాలక్ష్మి అవతారంలో శుక్రవారం దర్శనమిచ్చిన బల్కంపేట రేణకా ఎల్లమ్మ అమ్మవారు









## నగరం.. ఓ పూల వనం..

### చారిత్రక చార్మినార్ వద్ద గౌరమ్మకు మహిళల వందనం

నగరంలో బతుకమ్మ వేడుక ఓ పూల వనాన్ని తలపిస్తున్నది. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి ప్రతిరోజు సాయంత్రం ప్రతి కూడలి పూల సంబురాన్ని తలపిస్తున్నది. ప్రతి ఇల్లు భిన్న రకాల పూల గుమగుమలతో పరిమళిస్తున్నది. కాగా, పిల్లా పాపల నుంచి పెద్దల వరకు, బాలికల నుంచి మహిళల దాకా బతుకమ్మ పండుగను జనరంజకంగా నిర్వహిస్తున్నారు. అయితే, మూడో రోజు అయిన బతుకమ్మ పండుగను ముద్ద పప్పు బతుకమ్మగా జరుపుకున్నారు. పప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం చేసి గౌరమ్మకు ఇష్టంగా మహిళలు సమర్పించారు. ఎన్నడూ లేని చారిత్రాత్మక చార్మినార్ వద్ద నగర మహిళలు పెద్ద ఎత్తున మోహరించి గౌరమ్మ పాటలు పాడుతూ కోలాటమాడారు. ఇది పరిణామం చూడ ముచ్చటగా కొనసాగింది.

## నగరం అన్ని విధాలా అభివృద్ధికి ప్రణాళికలు

### రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అసోచామ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2024కు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మాదాపూర్, అక్టోబర్ 4: తెలంగాణలో పట్టణాభివృద్ధి అత్యంత వేగంగా ముందుకు సాగుతున్నట్లు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం ఏర్పాటు చేసిన అసోచామ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్–2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విచ్చేసి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అసోచామ్ రాష్ట్ర స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రణవ గ్రూప్ సీటీఓ రాంబాబు బురుగు, పూణే యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అలర్ట్, డాక్టర్ పూనమ్ కశ్యప్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్, ఐఆర్ఎస్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి, ఫీన్సి గ్రూప్ గౌరవ కాన్సుల్ జనరల్ ఆఫ్ రపబ్లిక్ ఆఫ్ కోరియా సురేశ్ చుక్కపల్లితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో పట్టణాభివృద్ధి అత్యంత వేగంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని స్థిరమైన దిశగా నడిపేందుకు దోహదపడే వినూత్నమైన మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టులు, సాంకేతికతపై ప్రత్యేక దృష్టి పెడుతూ అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్ధ వార్షిక ఆదాయంలో రంగారెడ్డి రారాజు

- రూ.80 శాతం టార్గెట్ పూర్తిచేసిన అధికారులు
- రూ.1438 కోట్లు ఆదాయంతో రాష్ట్రంలో టాప్
- హైదరాబాద్ రూ.656 కోట్లు
- రవాణా శాఖ వివిధ పన్నులు, సేవలతో ఆదాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, ఆర్టీఓ సుభాష్ చందర్ రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అర్ధ వార్షిక ఆదాయంలో రంగారెడ్డి రారాజుగా నిలిచింది. రాష్ట్రం మొత్తం ఆదాయంలో 45 శాతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే సమకూరింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అర్ధ వార్షిక ఆదాయం రూ.1436 కోట్లు సమకూరిందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. కాగా, ఈ ఏడాది వార్షిక ఆదాయం రూ.1792 కోట్లు. ఇందులో ఇప్పటికే రూ.1436 కోట్లు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రం మొత్తం ఆదాయం రూ.3195 కోట్లు ఆదాయం రాగా, అందులో 45 శాతం ఉమ్మడి రాష్ట్రానిదేనని తెలిపారు. ఉమ్మడి జిల్లాలు రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్‌లు సంయుక్తంగా రూ.1436 కోట్ల ఆదాయం సమకూరినట్టు వివరించారు. రంగారెడ్డి జిల్లాలో రూ.802 కోట్లు, మేడ్చల్ నుంచి రూ.595 కోట్లు, వికారాబాద్ నుంచి రూ.39 కోట్లు సమకూరినట్టు పేర్కొన్నారు. త్రైమాసిక పన్నుల ద్వారా రూ.161 కోట్లు, లైఫ్ టాక్స్ రూ.1120 కోట్లు, ఫీజుల ద్వారా రూ.92 కోట్లు, సర్వీస్ ఛార్జీలతో రూ.21 కోట్లు, గ్రీన్ ట్యాక్స్ రూ.10 కోట్లు, తనిఖీలతో రూ.32 కోట్లు ఆదాయం సమకూరినట్టు వివరించారు. వార్షిక ఆదాయం రూ.1792 కోట్లు కాగా, అందులో రూ.1436 కోట్లు సాధించినట్టు వివరించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్ను చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఓవర్ లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్టీఓ సుభాష్ చందర్ రెడ్డి, ఎంవీఐలు కిరణ్ కుమార్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, అనూష, ఉపాసిని పాల్గొన్నారు.

## తెలంగాణ తలదించుకునేలా.. సీఎం భాష

### కొంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

### ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టి.. హైడ్రాతో కాలయాపన



కొంపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 4: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తన భాషా ప్రవర్తనతో యావత్ ప్రజానీకం తలదించుకునేలా మారారని, ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టి హైడ్రాతో కాలయాపన చేస్తున్న చేతగాని ప్రభుత్వంపై బీజేపీ నేతలు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం, కొంపల్లిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి తాను ముఖ్యమంత్రి అనే హోదాను మరిచి సభ్య సమాజం తలదించుకునేలా తన భాష, ప్రవర్తన ఉందని, దానిని మార్చుకోవాలని హితవు పలికారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై చేసిన వాఖ్యలకు గాను సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని సూచించారు. పేదలపై హైడ్రా పంజా విసురుతూ రైతు రుణమాఫీని నీరుగార్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, అసెంబ్లీ కో–కన్వీనర్ పొత్తూరి శివాజీ రాజు, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరితారావు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పెద్ద బుద్ధుని సతీశ్ సాగర్, పట్టణ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, మధు, నర్సింహా, అశోక్, నర్సింగ రావు, శంకర్ నాయక్, దుర్గా, మాధురి పాల్గొన్నారు.